# నవాబుపేటలో మిన్నంటిన కాంగ్రెస్ 1000 రోజుల సంబరాలు




## పదేళ్లు ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్ కాంగ్రెస్ ప్రజాపాలనపై ధర్నాలు చేయడం సిగ్గుచేటు

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తుంటే బిఆర్ఎస్ నాయకలు ఓర్వలేకపోతుండ్రు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటి రామారావు హద్దులు దాటి మాట్లాడుతుండు**

**బిఆర్ఎస్‌పై సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్**

కరీంనగర్,సెప్టెంబర్ 02 (వాయిస్ టుడే): బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల ప్రజలను మోసం చేసింది చాలక కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పై ధర్నాలు చేయడమేంటని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.స్థానిక ముకరంపుర లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీకి ఇక భవిష్యత్తు కనిపించడంలేదని రోడ్డు మీదికొచ్చి ధర్నాలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే గంగుల అధికారిక క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ పై ఫ్లెక్సీ ఏర్పాటు చేయడమేంటని దాన్ని వెంటనే తొలగించాలని ఇది మంచి పద్ధతి కాదని తొలగించకపోతే పదేళ్ల బీఆర్ఎస్ దోపిడీపై కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబ దోపిడీని కేసీఆర్ కూతురు కవిత ధృవీకరిస్తుందని ఆదోపిడి పైసలు ఇంకా లెక్కపెట్టుకుంటున్నారని స్వయంగా ఆమెనే చెబుతుందని ఏముఖం పెట్టుకుని ధర్నాలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు.మీ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఎందుకు ఇవ్వలేదో దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని ఎందుకు మోసం చేశారో ఇలా అనేక హామీలు ఇచ్చి ఎందుకు ఒక్కటైనా నెరవేర్చలేదో మొదట ప్రజలకు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కేటీ రామారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హద్దులు దాటి మాట్లాడుతున్నాడని పద్దతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తారని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలలో పాల్గొంటున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తానే స్వయంగా లబ్ధిదారులకు వివిధ రకాల పథకాలు అందిస్తూ పథకాలు అమలు కావడంలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి మండిపడ్డారు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఎన్ని డ్రామాలు చేసినా బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మరని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలోకుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణ రెడ్డి, లక్కీరెడ్డి కిరణ్ రెడ్డి,ముక్క భాస్కర్, భారీ,తోట అంజయ్య,షబానా, గుడిపాటి రమణ రెడ్డి,ఫజల్, ఖలీల్,హనీఫ్ పాల్గొన్నారు.



## 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ భారీ నిరసన

**420 హామీలు--420 ఫిట్లు ఫ్లెక్సీతో ఆందోళన**

**ప్రజలకు చెల్లించాల్సిన బాకీలు వెంటనే చెల్లించాలి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి**



హుజూరాబాద్ సెప్టెంబర్ 2 (వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం భారీ నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సుమారు 3,000 మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. 420 హామీలు--420 ఫిట్లు పేరుతో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శించారు. అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డు ను ప్రజలకు పంపిణీ చేస్తూ హామీల అమలుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు పూర్తయినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను ప్రభుత్వం నిరాశపరిచిందని కౌశిక్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

**బాణసంచా కాల్చి.. స్వీట్లు పంపిణీ చేసి కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గం ప్రగతి పథంలో పయనం**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తామన్న పార్టీ నాయకులు**



చిగురుమామిడి, సెప్టెంబర్ 2 (వాయిస్ ఆఫ్ ప్రజలు): కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందె సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో నవాబుపేట గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడుతూ నినాదాలు చేశారు.

**ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందె సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో అభివృద్ధి పరుగులు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశంలో హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో శరవేగంగా ముందుకు సాగుతోందని నాయకులు అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిరుపేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్తాం అని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేస్తాయని తెలిపారు.

**వైఎస్సార్ వర్ధంతి వేడుకలు**

అనంతరం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందె సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్‌రెడ్డి, సాంబారి బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్‌రెడ్డి, కాంతాల మహిపాల్‌రెడ్డి, పూల లచ్చిరెడ్డి, ఎస్కే షాబుద్దీన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు పశ్చిమ అజయ్‌కుమార్, ఠాకూర్ నరేందర్‌సింగ్, మాడ శ్రీనివాస్, సుద్దాల ప్రవీణ్‌కుమార్, ఎనగందుల లక్ష్మణ్, బోయిని వంశీకృష్ణ, గుడిసె మల్లికార్జున్, ఠాకూర్ దిలీప్‌సింగ్, కంది నాగరాజు, ఠాకూర్ రానా ప్రతాప్‌సింగ్, వర్కోలు సంతోష్‌కుమార్, కూరెల్ల కిషోర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఐటీ టవర్‌ను షోకేస్‌గా కాదు ఎంప్లాయ్‌మెంట్ హబ్‌గా మార్చాలి

**స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించి ఖాళీ స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి**

**డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్**

కరీంనగర్,సెప్టెంబర్ 02 (వాయిస్ టుడే): నగరంలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఐటీ టవర్‌ను కేవలం షోకేస్‌గా పరిమితం చేయకుండా,స్థానిక నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించే ఎంప్లాయ్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ జోనల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది విద్యావంతులైన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని,స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో హైదరాబాద్. బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రజాధనంతో నిర్మించిన ఐటీ టవర్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా, టవర్‌లోని ఖాళీ స్థలాలు,అందుబాటులో ఉన్న మౌలిక వసతులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.ఐటీ టవర్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడంతో పాటు మరిన్ని ఐటీ సంస్థలు,సాఫ్ట్‌వేర్ కంపెనీలు,బీపీఓలు,స్టార్టప్‌లను తీసుకువచ్చి ఉద్యోగాల సంఖ్యను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.సురేష్.జిల్లా ఉపాధ్యక్షులు. శివ కుమార్.రాజ్ కుమార్ జిల్లా సహాయ కార్యదర్శిలు అరవింద్, విజయ్, నాయకులు,లక్ష్మణ్,అతీష్, శిరిప్రసాద్. అనీల్,నితిన్,విష్ణు,రాము పాల్గొన్నారు

## కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్,సెప్టెంబర్ 02(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి ఢిల్లీలోని ఏఐసిసి ప్రధాన కార్యాలయంలో ఎఐసిసి అధ్యక్షులు,రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖార్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీ పటిష్టానికి చేపడుతున్న పలు కార్యక్రమాలు చాలా అభినందనీయమని మరియు కార్యకర్తల్లో జోష్ నింపుతున్నదని వారు చెప్పారు.

## ఆద్య, అరహ కూతుర్ల జ్ఞాపకార్థం కోసం 8వ పుట్టినరోజు వేడుకలు



రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 02 (వాయిస్ టుడే): సిరిసిల్ల పట్టణం లోని 26 వ వార్డు సంజీవయ్య నగర్, ప్రాథమిక పాఠశాల లో రెడ్డిమల్ల రాజు, మౌనిక కూతుళ్లు(జ్ఞాపకార్థశీ) రెడ్డిమల్ల ఆద్య, అరహ 8 వ జన్మదిన సందర్భం గా విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, వారి కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు

**ప్రత్యేక పూజలు చేసిన సీఎం ఓఎస్డీ, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్ 02 (వాయిస్ టుడే): వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సీ హెచ్ హనుమంతరావు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామి, గాయత్రి మాత, ఆంజనేయ స్వామికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ సీహెచ్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులుకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వచనం అందించారు. అంతకు ముందు దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, సీఎం ఓఎస్డీకి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**